

బొల్లారం పారిశ్రామికవాడలో పీసీబీ అధికారుల తనిఖీలు

జిన్నారం, ఏప్రిల్ 10: బొల్లారంలోని పారిశ్రామికవాడలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు(పీసీబీ) అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఇటీవల పలు పరిశ్రమలు గ్రానైట్ వ్యర్థాల పారవేత, ఆయా పరిశ్రమల నుంచి పౌడర్ తదితర వాయు కాలుష్యం విడుదలపై ఫిర్యాదులు రాగా బుధవారం పీసీబీ ఏఈ అజయ్, సిబ్బంది పారిశ్రామికవాడలో వ్యర్థాలు పారవేస్తున్న పరిశ్రమలను తనిఖీ చేశారు.

'జల దోపిడీ'పై రెవెన్యూ అధికారుల చర్యలు

కాజీపల్లి పారిశ్రామికవాడలో నీటి ట్యాంకర్లను అడ్డుకున్న సిబ్బంది


జిన్నారం, ఏప్రిల్ 10: ఈనెల 8న 'పారిశ్రామికవాడల్లో జల దోపిడీ' అనే కథనం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైంది. దీంతో స్పందించిన రెవెన్యూ అధికారులు బుధవారం జిన్నారం మండలంలో దాడులు జరిపారు. ఆర్ఐ జయప్రకాశ్‌నారాయణ, రెవెన్యూ సిబ్బంది గడ్డపోతారం, కాజీపల్లి పారిశ్రామికవాడలకు నీటి సరఫరా చేస్తున్న ట్యాంకర్లను అడ్డుకొని వాహనాల టైర్ల నుంచి గాలి తీసివేశారు. అనంతరం నీటిని పంపింగ్ చేస్తున్న మోటార్లు, కార్యాలయాల వద్ద విద్యుత్ ఫ్యూజ్‌లు తొలగించి, రెవెన్యూ కార్యాలయానికి తరలించారు. కాగా నీటిని అక్రమంగా తరలించే వారిపై కేసులు నమోదు చేస్తామని, ట్యాంకర్ల ద్వారా జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్ఐ తెలిపారు.



గడ్డపోతారం శివారులో ఓ ట్యాంకర్ వాహనం టైర్ల నుంచి గాలి తీసివేస్తున్న ఆర్ఐ, సిబ్బంది

సదాశివపేటలో జగ్గారెడ్డి ఇఫ్తార్ విందు

సదాశివపేట ఏప్రిల్ 10 : సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టీ.జగ్గారెడ్డి సదాశివపేటలో ముస్లింలకు ఇఫ్తార్‌విందు ఇచ్చారు. ఈ విందులో అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమానికి తమ కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదన్నారు. ప్రతీఏటా తాను ఇఫ్తార్ విందు ఇవ్వడం ఆనవాయితీ అని, అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నానన్నారు. ముస్లింలకు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన రిజర్వేషన్లను కల్పిస్తామన్నారు. రంజాన్ పవిత్ర మాసం ముస్లింలలో ఆధ్యాత్మికత, పరోపకారం కలిగిస్తుందని జగ్గారెడ్డి అన్నారు.





సదాశివపేటలో మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డికి ఖర్జూరపండు తినిపిస్తున్న ముస్లిం, ఇఫ్తార్ విందులో జగ్గారెడ్డితో చిన్నారుల కరచాలనం

ఈద్ ముబారక్

- నేడు ఈద్ ఉల్ ఫితర్
- కనిపించిన నెలవంక
- ఈద్గాల వద్ద నమాజుకు ప్రత్యేక ఏర్పాట్లు



సంగారెడ్డి హాస్టల్ గడ్డ ఈద్గా వద్ద ఏర్పాటు చేసిన షామియానా

మెదక్ కల్చరల్/సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 10 : నెలరోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలు నేడు ఈద్ ఉల్ ఫితర్‌ను జరుపుకోనున్నారు. బుధవారం రాత్రి నెలపొడుపు కనబడటంతో గురువారం రంజాన్ పండుగను చేసుకోనున్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రాలతో పాటు మండల, గ్రామాల్లోని ఈద్గాలు, మసీదులను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. సంగారెడ్డిలోని హాస్టల్‌గడ్డ ఈద్గా వద్ద, మెదక్ రోడ్డులోని గద్ద బొమ్మ వద్ద ఈద్గా మసీదులో మున్సిపాలిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లను చేశారు. ఉదయం నిర్వహించనున్న నమాజుకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ఎండ తగలకుండా షామియానాలు ఏర్పాటు చేశారు. తాగునీటి సౌకర్యాన్ని కల్పించారు. మెదక్ పట్టణంలోని పెద్ద బజార్ ఈద్గాలో ఉదయం 9.30 గంటలకు, జామ మజీదులో 9.30కు, గాంధీనగర్ ఈద్గాలో 10కు, ఖువ్వతుల్ ఇస్లాం మజీద్‌లో 9.30కు మజీద్ ఏఉమర్బిన్ ఖత్తాబ్‌లో 7.30 గంటలకు ప్రార్థనలు ప్రారంభంకానున్నాయి.నమాజు తర్వాత ఇమాంలు ఖురాన్, హదీసులలోని విషయాలు తెలుపుతూ సందేశాన్ని ఇవ్వనున్నారు. సంగారెడ్డి పాత పట్టణంలో తాత్కాలికంగా రోడ్డుకిరువైపుల ఏర్పాటు చేసిన దుకాణాలు కిటకిటలాడాయి. మహిళల ఆభరణాలు, వివిధ డిజైన్‌లలో తయారు చేసిన రంగురంగుల గాజులు, సిరామిక్, గాజు పాత్రలతో తయారు చేసిన గృహోపకరణాలు, టోపీలు, పండుగ సందర్భంగా అవసరమయ్యే వస్తువులు, వంట సామగ్రి కొనుగోలుకు పెద్దఎత్తున మార్కెట్‌కు రావటంతో సందడి నెలకొన్నది.



పరిశ్రమల్లో ప్రమాదాలు తలెత్తకుండా

చర్యలు తీసుకోవాలి

- అత్యాధునిక పరిజ్ఞానాన్ని వినియోగించండి
- కాలం చెల్లిన రియాక్టర్లను మార్చండి
- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 10 : పరిశ్రమల్లో ప్రమాదాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని వివిధ పరిశ్రమల యాజమాన్యాలకు సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. కలెక్టరేట్‌లో పరిశ్రమల యాజమాన్యాలతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. పరిశ్రమల ప్రతినిధులు తమ యూనిట్లలో అగ్ని ప్రమాదాలు, పేలుళ్ల నివారణకు ఎలాంటి పద్ధతులను పాటిస్తున్నారనే వివరాలను అందించాలన్నారు. జిల్లాలో ఐదు సంవత్సరాలుగా రసాయన పరిశ్రమల జాబితాను సమర్పించాలని, అదే విధంగా రియాక్టర్ల జీవిత కాలాన్ని ధ్రువీకరించే థర్డ్ పార్టీ తనిఖీ నివేదికలతో పాటు పలు ప్రభుత్వ శాఖల తనిఖీ నివేదికలు సమర్పించాలని పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. కాలం చెల్లిన రియాక్టర్లను మార్చాలని పారిశ్రామికవేత్తలకు సూచించారు. ఈ నెల మూడో వారంలో అనుభవజ్ఞులైన వారితో పారిశ్రామిక భద్రత, స్టాండర్డ్ ఆపరేటివ్ నోట్ ప్రొసీజర్స్‌పై జిల్లాలోని అన్ని రసాయన పరిశ్రమలకు శిక్షణనందించాలని ఆదేశించారు. పారిశ్రామికవేత్తలు పరిశ్రమల శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు అత్యాధునిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని ఆమె ఆదేశించారు. జిల్లాలోని అన్ని కంపెనీలను పరిశ్రమల శాఖ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలని ఆదేశించారు. భద్రతా నియమాలు పాటించని పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో పరిశ్రమల శాఖ జిల్లా జనరల్ మేనేజర్ ప్రశాంత్‌కుమార్, జిల్లా ఫైర్ అధికారి శ్రీనివాస్, పీసీబీ అధికారిణి గీత, పటాన్‌చెరు ఇండస్ట్రియల్ అధికారి కుమార్‌పాటక్, వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇప్పుడిప్పుడే వరి

కోతలు షురూ

- సంగారెడ్డి జిల్లాలో 143 కొనుగోలు కేంద్రాలు ప్రారంభం
- ధాన్యం కోసం ఎదురుచూపులు

సంగారెడ్డి టౌన్ ఏప్రిల్ 10 :ఈ నెల 1 నుంచే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించగా, జిల్లా వ్యాప్తంగా వరికోతలు ఊపందుకోకపోవడంతో ధాన్యం కోసం ఎదురుచూస్తున్నారు. కాగా నల్లావాగు రిజర్వాయర్ కింద బుధవారం నుంచి వరి కోతలు ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా పూర్తిస్థాయిలో వరికోతలు ప్రారంభించాలంటే మరో 15 రోజులు పట్టవచ్చని రైతులు తెలిపారు.

జిల్లాలో 211 కొనుగోలు కేంద్రాలు

యాసంగిలో జిల్లా వ్యాప్తంగా 211 కొనుగోలు కేంద్రాల్లో వరిధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఇందులో ఐకేపీ ద్వారా 101, పీఏసీఎస్‌ల ద్వారా 98, డీసీఎంఎస్ పరిధిలో 12 కేంద్రాలను ప్రారంభించనున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 143 కేంద్రాలను అధికారులు ప్రారంభించారు. ఇందులో ఐకేపీ ద్వారా 75, పీఏసీఎస్‌ల ద్వారా 56, డీసీఎంఎస్ పరిధిలో 12 కేంద్రాల్లో కొనుగోళ్ల కోసం ఏర్పాటు చేశారు. వరికోతలు ఊపందుకున్న తర్వాత మిగతా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ వల్లూరి క్రాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు నిర్వాహకులు కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల కోసం తాగునీరు, టెంట్లు తదితర కనీస వసతులను ఏర్పాటు చేశారు.



కల్హేర్ మండలంలోని నల్లవాగు రిజర్వాయర్ కింద సాగుచేసిన వరి పంటను కోస్తున్న హార్వెస్టర్ యంత్రం

1.09 లక్షల ఎకరాల్లో వరిసాగు

సంగారెడ్డి జిల్లాలో ఈ యాసంగిలో మొత్తం లక్షా 9 వేల ఎకరాల్లో వరిపంటను సాగు చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. ఈ సీజన్‌లో 1.88 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఇందులో ఏప్రిల్ మాసంలో 17 వేల టన్నులు, మే నెలలో 1.46 లక్షల టన్నుల ధాన్యం, జూన్‌లో 25 వేల టన్నుల ధాన్యం రావచ్చని అధికారులు అంచనా వేశారు. అయితే 12 నుంచి 17 తేమశాతం ఉన్న ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయాలని నిర్ణయించారు. అంతకు మించి తేమశాతం ఉన్న ధాన్యాన్ని ఆరబెట్టేందుకు కొనుగోలు కేంద్రాల వద్ద ప్రత్యేకంగా కల్లాలను సిద్ధం చేశారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు

భత్యం విడుదల

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 10 : జిల్లాలో ప్రత్యేక అవసరాల పిల్లలకు సమగ్ర శిక్షా అందించాల్సిన వివిధ రకాల భత్యాలు ఎట్టకేలకు విడుదలయ్యాయి. 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి విద్యా సంవత్సరం ఆరంభంలో విడుదల కావాల్సిన నిధులు ముగింపు దశలో విడుదల అయ్యాయి. నెలనెలా చెల్లించాల్సిన అన్ని రకాల భత్యాల కింద నిధులను ప్రత్యేక అవసరాల పిల్లల ఖాతాల్లో జమ చేశారు.

సంగారెడ్డి జిల్లాకు రూ.26,52,500 నిధులు మంజూరు

జిల్లాలోని ప్రత్యేక అవసరాల పిల్లలకుగాను రవాణా భత్యం కింద రూ.13,72,500 నిధులు, ఎస్కార్ట్ కింద రూ.7,48,000, స్టైఫండ్ రూ.5,11,000, రీడర్ అలవెన్స్ కింద 21,000 నిధులు, మొత్తం రూ.26,52,500 నిధులు మంజూరయ్యాయని సమగ్ర శిక్షా సెక్టోరియల్ అధికారి వెంకటేశం తెలిపారు. జిల్లాలో 713 మంది ప్రత్యేక అవసరాల పిల్లలు ఉండగా, వారి కోసం విద్యా శాఖ భవిత కేంద్రాలను నెలకొల్పింది. విలీన విద్య పేరుతో పిల్లలకు ప్రత్యేకంగా బోధిస్తున్నారు. ఈ కేంద్రాలకు వచ్చే పిలల్లలకు, ప్రత్యేకంగా బాలికలకు స్టైఫండ్, అంధ విద్యార్థుల చదువుకు నెలనెలా భత్యంగా విద్యాశాఖ సమగ్ర శిక్షా అధికారులు చెల్లిస్తున్నారు.



సంగారెడ్డి భవిత కేంద్రంలోని ప్రత్యేక అవసరాల పిల్లలు(ఫైల్)

నిధులను రికవరీ చేయాలి

- కద్పుల్ పీఏసీఎస్ డైరెక్టర్ల డిమాండ్
- విచారణ కొనసాగుతుండగానే చైర్మన్ రాజీనామా
- రికార్డులు సీజ్ చేసిన అధికారులు

కల్హేర్/సిర్గాపూర్, ఏప్రిల్ 10: సిర్గాపూర్ మండల పరిధిలోని కద్పుల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో నిధులను చైర్మన్, కార్యదర్శి(సీఈవో) దుర్వినియోగ పర్చారని ఏడుగురు డైరెక్టర్లు గత నెల జిల్లా సహకార అధికారికి ఫిర్యాదు చేశారు. అయితే, విచారణ వేగవంతం చేసి అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలని, నిధులను రికవరీ చేయాలని డైరెక్టర్లు కోరుతున్నారు.

పీఏసీఎస్ చైర్మన్ గాల్‌రెడ్డిగారి శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి గత ప్రభుత్వ హయాంలో పీఏసీఎస్ నిర్వహణలో ఒకే పార్టీకి చెందిన వారికి ప్రయోజనం చేకూర్చారని, చైర్మన్ గృహంలోనే కార్యకలాపాలు నిర్వహించి కార్యదర్శి ఏకపక్షంగా వ్యవహరించాడని, సర్వసభ్య సమావేశం, పాలకవర్గం సమావేశాలు నిర్వహించలేదని డైరెక్టర్లు గత నెలలో ఫిర్యాదు చేశారు. దీనిని నిలువరించాల్సిన చైర్మన్ కార్యదర్శికి వంత పాడుతూ లక్షల రూపాయలను దుర్వినియోగం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ కొనసాగుతుండగానే ఇటీవల చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి రాజీనామా చేయడం గమనార్హం. ఇటీవల సహకార రిజిస్ట్రార్లు చిన్నా రావ్, శ్రీనివాస్ కద్పుల్ పీఏసీఎస్‌ను సందర్శించి విచారణ చేపట్టారు. డైరెక్టర్ల సమక్షంలో నిధుల దుర్వినియోగానికి సంబంధించిన సాక్ష్యాలను నమోదు చేసుకుని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలోని రికార్డులను సీజ్ చేసినట్లు తెలిసింది. పూర్తిస్థాయిలో విచారణ జరిపి దుర్వినియోగమైన నిధులను రికవరీ చేయాలని డైరెక్టర్లు డిమాండ్ చేస్తున్నారు. వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న సిర్గాపూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు జలీల్‌ను వారం రోజుల క్రితం డైరెక్టర్లు చైర్మన్‌గా ఎన్నుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో బీఆర్ఎస్‌కు ఏడుగురు డైరెక్టర్లు, కాంగ్రెస్‌కు ఆరుగురు డైరెక్టర్ల బలం ఉంది. అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఇద్దరు డైరెక్టర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ బలంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన జలీల్ చైర్మన్ అయ్యారు.

మెదక్ గడ్డ..బీఆర్ఎస్ అడ్డా

- పాల పొంగులా కాంగ్రెస్ పాలన
- అభయ హస్తం కాదు శూన్య హస్తం
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 10 : మెదక్ గడ్డ, బీఆర్ఎస్ పార్టీ అడ్డా అని, మెదక్ ఎంపీ స్థానంలో లోకల్ లీడర్ వెంకట్రామారెడ్డి గెలుపు ఖాయమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. పటాన్‌చెరు మండలం రుద్రారం గణేష్ ఆలయంలో బుధవారం బీఆర్ఎస్ ప్రచార రథాలకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డితో కలిసి ప్రత్యేక పూజలను నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ ఎన్నికలో కాంగ్రెస్ నాయకులు ఆచరణ సాధ్యం కాని హామీలను ఇచ్చి ప్రజలను దోఖా చేసిందన్నారు. సంక్షేమ పథకాలకు కోత పెట్టారన్నారు. ఆరు గ్యారంటీలు, అభయహస్తం అంటూ అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్ ప్రజలకు శూన్యహస్తం అందించిందన్నారు. కాంగ్రెస్ పాలన పాల పొంగు లాంటిదని, అసలు స్వరూపం బయటపడిందన్నారు. నాడు నిరుద్యోగ భృతి ఇస్తామని రాహుల్, ప్రియాంక గాంధీ, రేవంత్‌రెడ్డి మాట్లాడారని, నేడు తోక ముడిచారన్నారు. వరి పంటకు బోనస్ ఇవ్వాలని మాజీ సీఎం కేసీఆర్ అడుగితే సీఎం రేవంత్‌రెడ్డి అవాకులు, చెవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. చేతనైతే రైతులకు రూ.2లక్షల రుణ మాఫీ చెయ్యాలని కోరారు. వెంకట్రామారెడ్డి లోకల్ అని, తెల్లాపూర్‌లో నివాసం ఉంటున్నారని గుర్తుచేశారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో పనిచేసిన విద్యావంతుడు వెంకట్రామారెడ్డిని ఎంపీగా గెలిపించుకుంటే ఎంతో మేలు జరుగుతుందన్నారు. గణేష్‌స్వామి గడ్డ అచ్చొచ్చిన స్థలమని, ఎంపీగా బీఆర్ఎస్ గెలుపు పక్కా అని హరీశ్‌రావు అన్నారు.



ప్రచార రథాలను ప్రారంభిస్తున్న హరీశ్‌రావు

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

కుకునూరుపల్లి, ఏప్రిల్ 10: మండల పరిధిలోని రాయవరం గ్రామంలో బుధవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో సీఈవో రాములు వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని, దళారులకు ధాన్యాన్ని విక్రయించి రైతులు మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది సత్తిరెడ్డి, బాలరాజు మరియు మల్లేశం, రాజేష్, పలువురు మహిళలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన


విద్యార్థులను అభినందిస్తున్న సీఐ విద్యాసాగర్

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 10: సైబర్ అంబాసిడర్ బాధ్యతలు అప్పగించే కార్యక్రమం ద్వారా సిద్దిపేట అర్బన్ మండలం బక్రీ చెప్యాల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సైబర్‌నేరాలపై ఐదు రోజులపాటు అవగాహన కార్యక్రమాన్ని కల్పించినట్లు త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపారు. బుధవారం సైబర్ క్రైం డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సైబర్ అంబాసిడర్ ప్లాట్ ఫారం కోర్సులో అద్భుత ప్రదర్శన ఇచ్చిన విద్యార్థులు ఎం. సంపూర్ణ, ఎం.లోకేష్, ఎం.స్నేహ, డి. చైతన్యకు ప్రశంసా పత్రాలు అందించారు. విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని తల్లిదండ్రులకు పూర్తిగా వివరించాలని సీఐ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.నాగేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు అనీల్‌కుమార్, సుహాసిని, రమాదేవి, శ్రీశైలం, లక్ష్మయ్య, సునీత, ఆంజనేయులు, పోలీస్ సిబ్బంది పూజ, చంద్రకాంత్, రఘుపతి, కరుణాకర్, కళ్యాణ్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

అడ్‌హక్ కమిటీతో బార్ అసోసియేషన్‌కు సంబంధం లేదు


సమావేశంలో మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మనోహర్

చేర్యాల, ఏప్రిల్ 10: కోర్టు ఏర్పాటు విషయమై ఇటీవల పలువురు న్యాయవాదులు ఏర్పాటుచేసుకున్న అడ్‌హక్ కమిటీతో బార్ అసోసియేషన్‌కు ఎలాంటి సంబంధం లేదని చేర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భూమిగారి మనోహర్ స్పష్టం చేశారు. బుధవారం చేర్యాలలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెల 28న బార్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయని, అందులో ఓడిన రమేశ్ జీర్ణించుకోలేక అసత్య ఆరోపణలు చేయడం సబబు కాదన్నారు. కోర్టు ఏర్పాటు కాకముందే తప్పుడు సంకేతాలకు దారి తీస్తుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. కోర్టు సాధనకు తాము అన్నివర్గాల సహకారాన్ని తప్పక తీసుకుంటామన్నారు. అడ్‌హక్ కమిటీ ఏర్పాటు విషయమై బార్ కౌన్సిల్ దృష్టికి తీసుకువెళ్తానన్నారు. సమావేశంలో కాటం సురేందర్, ప్రణీత్, ఉట్కూరి అమర్ ఉన్నారు.

మహిళలకు న్యాయం జరిగేలా చూడాలి

● న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు



సంగారెడ్డిలోని సఖి కేంద్రంలో రికార్డులను తనిఖీ చేస్తున్న హనుమంతరావు

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 10: సఖి కేంద్రానికి వచ్చే మహిళలకు న్యాయం జరిగేలా చూడాలని న్యాయాధికారి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు అన్నారు. సంగారెడ్డిలోని సఖి కేంద్రం, బాలసదనంలో బుధవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహహింస, బాల్య వివాహ, పోక్సో చట్టం, వరకట్న నిషేధ చట్టాలపై మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. వేసవి వచ్చినందున వడదెబ్బ తగలకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలపై అవగాహన సదస్సులు ఏర్పాటుచేసి పలు సూచనలు చేయాలన్నారు. అనంతరం ఆయా కేంద్రాల్లో రికార్డులను తనిఖీ చేశారు. న్యాయాధికారి వెంట సఖి కార్యనిర్వహణ అధికారి రేణుక, కౌన్సిలర్ కల్పన, బాలసదనం ఇన్‌చార్జి విజయ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్య చరిత్రలో 'హోమియోపతి' ప్రత్యామ్నాయ వైద్యం

● హోమియోపతి సీనియర్ మెడికల్ ఆఫీసర్ డా.నర్మదషిండే


సంగారెడ్డిలో సామ్యూల్ హానిమన్ జయంతిలో పాల్గొన్న హోమియోపతి డాక్టర్లు, సిబ్బంది

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 10: వైద్య చరిత్రలో 'హోమియోపతి' ప్రత్యామ్నాయ వైద్యమని హోమియోపతి సీనియర్ మెడికల్ ఆఫీసర్ డా.నర్మదషిండే పేర్కొన్నారు. ప్రపంచానికి హోమియో విధానాన్ని పరిచయం చేసిన డా.సామ్యూల్ హానిమన్ 269 జయంతి సందర్భంగా సంగారెడ్డి ఆయూష్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లోని హోమియోపతి డిస్పెన్సరీలో బుధవారం సామ్యూల్ హానిమన్ చిత్రపటానికి డా.నర్మదషిండే పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది హోమియోపతి వైద్యం పొందుతూ ఆరోగ్యంగా జీవిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద సీనియర్ మెడికల్ ఆఫీసర్ డా.శ్యామ్ సుందర్‌ప్రసాద్, డా.సమీన, ఫార్మసిస్టులు ఎస్.రమేశ్, ఉమాదేవి, హేమలత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


బుజరాన్‌పల్లిలో వేంకటేశ్వరస్వామి కల్యాణంలో పాల్గొని పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి


నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేటలో మత్తడిపోచమ్మ జాతర సందర్భంగా బండ్ల ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం


కల్హేర్ మండల పరిధిలోని క్రిష్టాపూర్‌లో అఖండ హరినామ సప్తాహలో కరణ్ మహరాజ్‌ను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

పెద్దశంకరంపేట్, ఏప్రిల్ 10: పెద్దశంకరంపేట మండల పరిధిలోని బుజరాన్‌పల్లిలో పద్మావతి సహిత లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం సాయంత్రం ఉత్సవమూర్తులను పల్లకీసేవలో గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగించారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బూరెమ్మవిఠల్, ఆలయ కమిటీ సభ్యులు జగన్నాథరావు, సుధాకర్‌రావు, అశోక్‌రావు పాల్గొన్నారు.


సిర్గాపూర్ మండలం పోచాపూర్‌లో నిర్వహించిన కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

వైభవంగా విగ్రహాల ఊరేగింపు

వట్‌పల్లి, ఏప్రిల్ 10: మండల పరిధిలోని మేడుకుంద గ్రామంలో నిర్మించిన బీరప్పస్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు డోలు వాయిద్యాలు, ఒగ్గు కళాకారుల నృత్యాల నడుమ ఊరేగింపు ఆలయం వద్దకు సాగింది. ఉత్సవాలకు హాజరైన భక్తులకు ఆలయ నిర్వాహకులు ప్రసాద వితరణ, అన్నదానం ఏర్పాటు చేశారు.

ఘనంగా దుర్గామాత జాతర

కల్హేర్/సిర్గాపూర్, ఏప్రిల్ 10: సిర్గాపూర్ మండల పరిధిలోని పోచాపూర్‌లో ఉగాది పండుగ సందర్భంగా దుర్గామాత ఆలయజాతర బుధవారం నిర్వహించారు. ఉదయం రథోత్సవంలో భాగంగా గ్రామంలోని ప్రధాన వీధుల గుండా రథాన్ని ఊరేగించారు. అనంతరం కుస్తీపోటీలు నిర్వహించగా.. పేరు మోసిన పహిల్వాన్‌లు పాల్గొనడంతో పోటీలు రసవత్తరంగా జరిగాయి. విజేతలైన మల్లయోధులకు నగదు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో తెలంగాణ ప్రాంతం వారే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన మల్లయోధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు మండలాధ్యక్షుడు క్రిష్ణమూర్తి, మాజీ సర్పంచ్ రాములు, నాయకులు లక్ష్మయ్య, పండరి, సాయిలు పాల్గొన్నారు.

ముగిసిన అఖండ హరినామ సప్తాహ

మండల పరిధిలోని క్రిష్టాపూర్‌లో ఏడురోజుల పాటు నిర్వహించిన అఖండ హరినామ సప్తాహ కార్యక్రమం బుధవారం ముగిసింది. అంతర్గాం గజేంద్ర ఆశ్రమ పీఠాధిపతి కరణ్ గజేంద్ర భారతి మహరాజ్, నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కరణ్ మహరాజ్ మాట్లాడుతూ మానవాళి జీవన విధానం భక్తితో ముడి పడి ఉన్నందున ఇలాంటి కార్యక్రమాలను ప్రతి గ్రామంలో నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, కరణ్ మహరాజ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కల్హేర్ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, మాజీ సర్పంచులు కిష్టారెడ్డి, బేతయ్య, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

అట్టహాసంగా బండ్ల ప్రదర్శన

నారాయణఖేడ్, ఏప్రిల్ 10: నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట మత్తడి పోచమ్మ జాతరను పురస్కరించుకుని బుధవారం రెండోరోజు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గామాతతో పాటు మత్తడి పోచమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకం, అలంకరణతోపాటు భక్తులు ఓడిబియ్యం, కండజ్యోతి సమర్పణలు విశేషంగా చేపట్టారు. సాయంత్రం బండ్ల ప్రదర్శనను అట్టహాసంగా నిర్వహించారు.

పలు గ్రామాల్లో పాచిబండ్ల ప్రదర్శన, రథోత్సవం

కొల్చారం, ఏప్రిల్ 10: ఉగాదిని పురస్కరించుకుని కొల్చారం మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం గ్రామ దేవతలకు పాచిబండ్ల ప్రదర్శన నిర్వహించారు. కొల్చారంలోని ఎల్లమ్మ, నల్లపోచమ్మ, లక్ష్మమ్మ, పెద్దమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్లకు డప్పుచప్పుళ్ల మధ్య పాచిబండ్లను ప్రదర్శించారు.


కొల్చారం మండలం వెంకటాపూర్‌లో వేంకటేశ్వరస్వామికి రథోత్సవం నిర్వహిస్తున్న గ్రామస్థులు

వెంకటాపూర్‌లో వేంకటేశ్వరస్వామికి బుధవారం రథోత్సవం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్‌ఐ మహ్మద్‌గౌస్ చర్యలు తీసుకున్నారు.

ఘనంగా బోనాల ఊరేగింపు

మెదక్, ఏప్రిల్ 10: చిన్నశంకరంపేట మండలం జంగరాయి గ్రామంలోని ఊడలమర్రి నల్లమ్మపోచమ్మ జాతరలో భాగంగా రెండోరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం డప్పు వాయిద్యాలు, పోతురాజుల విన్యాసాల మధ్య బోనాల ఊరేగింపు వైభవంగా సాగింది.

కంగ్టిలో శోభాయాత్ర

కంగ్టి, ఏప్రిల్ 10: మండల పరిధిలోని రాసోల్‌లో నిర్మించిన రామాలయంలో ప్రాణ ప్రతిష్ఠ చేయనున్న సీతారామచంద్రుల విగ్రహాలకు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజనలు, నృత్యాలు చేస్తూ విగ్రహాలను ప్రత్యేక వాహనంలో ఊరేగిస్తూ శోభాయాత్ర చేపడుతూ చాప్టా మీదుగా రాసోల్‌కు వెళ్లారు. కాగా ప్రాణ ప్రతిష్ఠ నేపథ్యంలో 11 నుంచి రాసోల్‌లో సప్తాహం కొనసాగనున్నది.

ఎట్టకేలకు కాంగ్రెస్‌లోకి మదన్‌రెడ్డి?

● ముహూర్తం ఖరారు చేసుకున్న మాజీ ఎమ్మెల్యే
● పెద్దఎత్తున అనుచరవర్గంతో చేరేందుకు సన్నాహాలు
● సీఎం రాజకీయ సలహాదారుడు నరేందర్‌రెడ్డితో చర్చలు


మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నర్సాపూర్, ఏప్రిల్ 10: నర్సాపూర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ కీలక నేతగా ఉన్న మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఎట్టకేలకు కాంగ్రెస్‌లో పెద్దఎత్తున తన అనుచర వర్గంతో చేరేందుకు ముహూర్తం ఖరారైంది. 15 రోజుల క్రితం స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి పార్టీలో చేరే దానిపై చర్చించిన విషయం విదితమే. అయితే సీఎంను కలిసిన ఒకటి రెండురోజుల్లోనే తన అనుచర వర్గంతో పార్టీలో కలవాలని నిర్ణయించుకున్నా వివిధ కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చింది. చివరకు బుధవారం నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, రాష్ట్ర నాయకులు సుహాసినిరెడ్డి, శేషసాయిరెడ్డిలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయల సలహాదారుడు నరేందర్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిసి పార్టీలో ఏ రోజు చేరాలనే విషయమై చర్చించినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. ఈ నెల 15వ తేదీలోపు ఏదో ఒకరోజు సీఎంతో పాటు పార్టీ ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరేందుకు నిర్ణయించుకున్నట్లు తెలిసింది. దీంతో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరిక అంశం ఎట్టకేలకు ఖరారైంది. ఇప్పటికే మదన్‌రెడ్డి తన అనుచరవర్గాన్ని తన వెంట రావాలని ఫోన్‌ద్వారా ఆహ్వానిస్తున్నారు. అన్నివిధాలా తాను మీకు అండగా ఉంటానని మదన్‌రెడ్డి భరోసా ఇస్తూ.. తనవెంట తీసుకెళ్లడానికి తీవ్రంగా యత్నిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సునితారెడ్డి సైతం బీఆర్‌ఎస్ నుంచి నాయకులు వీడకుండా తనదైన శైలిలో వారిని కట్టడి చేయడానికి ప్రయత్నిస్తున్నారు. అదేవిధంగా మాజీ మంత్రి హరీశ్‌రావు కూడా నియోజకవర్గంలో పార్టీ ముఖ్యనాయకులు పార్టీ వీడకుండా స్వయంగా కొందరికి ఫోన్ కూడా చేస్తున్నట్లు సమాచారం. దీంతో ముఖ్యనేతల మధ్య ఎటు నిర్ణయం తీసుకోవాలో తెలియక అయోమయంలో కొందరు ఉండగా... మరికొందరు మదన్‌రెడ్డి వెంట వెళ్లడానికి నిర్ణయించుకున్నారు. ఇంకొందరు ఎంపీ ఎన్నికలయ్యే వరకు వేచి చూద్దామనే ధోరణిలో ఉన్నట్లు తెలిసింది. మొదటి నుంచి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉన్నవారు బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతామని అంటున్నారు. మరీ మదన్‌రెడ్డి వెంట వెళ్లేవారు ఎందరో.. పార్టీలో ఉండేవారు ఎందరో ఒకటి రెండురోజుల్లో తేలనున్నది. ఏదిఏమైనా మదన్‌రెడ్డి బీఆర్‌ఎస్‌ను వీడటం ఆ పార్టీకి నర్సాపూర్‌లో పెద్ద నష్టమే అని చెప్పవచ్చు. నియోజకవర్గంలో తనకంటూ ప్రత్యేక అనుచర గణం ఉండడంతో పాటు పెద్ద సంఖ్యలో ఓటర్లను ప్రభావితం చేయగల నాయకత్వ లక్షణాలు ఉన్న వ్యక్తి మదన్‌రెడ్డి. అంతేకాకుండా మాజీ సీఎం కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడనే పేరు రాష్ట్రస్థాయిలో ఉండటం వల్ల బీఆర్‌ఎస్ రాష్ట్ర నేతలు కూడా మదన్‌రెడ్డి పార్టీ వీడటం పట్ల కొంత ఇబ్బందికరంగానే ఫీలవుతున్నారని చెప్పవచ్చు.

ఇఫ్తార్ విందులో మంత్రి దామోదర్ రాజనర్సింహ


ఇఫ్తార్ విందులో పాల్గొన్న దామోదర్

వట్‌పల్లి, ఏప్రిల్ 10: మండల కేంద్రమైన వట్‌పల్లిలో బుధవారం రాత్రి ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు ఖాజా ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఉపవాస దీక్షను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వినయ్‌గౌడ్, మండలాధ్యక్షుడు రమేష్ జ్యోషి, నాయకులు విశ్వాస్, రమేష్, దిగంబరావ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని సెల్ టవర్ ఎక్కి వ్యక్తి హల్‌చల్

● 2 గంటల పాటు హైడ్రామా

కంది, ఏప్రిల్ 10: తన సమస్యలు పరిష్కరించాలంటూ మద్యం మత్తులో ఓ వ్యక్తి బుధవారం కంది తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని బీఎస్‌ఎన్‌ఎల్ సెల్‌టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. మధ్యాహ్నం 1.30 నుంచి 3.30 వరకు దాదాపు రెండు గంటలపాటు సెల్ టవర్‌పై ఫీట్లు చేస్తూ, వేలాడుతూ అందరినీ భయభ్రాంతులకు గురిచేశాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న సంగారెడ్డి రూరల్ పోలీసులు ముందు జాగ్రత్త కోసం ఫైర్ ఇంజన్‌ను తెప్పించారు. సదరు వ్యక్తిని కిందకు రప్పించడానికి ఎస్‌ఐ వినయ్‌కుమార్, తహసీల్దార్ విజయలక్ష్మి అతని సమస్యలు తీరుస్తామని హామీఇవ్వడంతో కిందకు దిగాడు. కంది మండలం కాశీపూర్ గ్రామానికి చెందిన లక్ష్మయ్యకు 40 ఏళ్ల కిందట ఇచ్చిన ఇంటి పట్టా సర్టిఫికెట్ ఎలుకలు కొట్టాయని, తనకు మరో సర్టిఫికెట్ కావాలని, అలాగే కొత్త రేషన్ కార్డు ఇప్పించాలని కొన్ని రోజుల క్రితం రెవెన్యూ అధికారులను కోరాడు. అధికారులు సర్టిఫికెట్ కావాలంటే అతని ఇంటి పక్కనున్న మరొకరి సర్టిఫికెట్ ఏదైనా ఉంటే తీసుకునిరమ్మన్నారు. అధికారులు చెప్పింది వినకుండా సెల్ టవర్ ఎక్కాడు. ఎస్‌ఐ, తహసీల్దార్ లక్ష్మయ్య త్వరలోనే సమస్య తీరుస్తామని కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. సెల్‌టవర్ ఎక్కకుండా చుట్టూ రక్షణ కవచం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


సెల్ టవర్ ఎక్కిన లక్ష్మయ్య

అనుమానాస్పదస్థితిలో గర్భిణి మృతి

● అత్తింటివారే కొట్టి చంపారని మృతురాలి బంధువుల ఆరోపణ


నాగలత(ఫైల్)

అక్కన్నపేట, ఏప్రిల్ 10: అనుమానాస్పద స్థితిలో గర్భిణి బుధవారం మృతిచెందింది. అక్కన్నపేట మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన ఎలవేని అశోక్‌కు హన్మకొండ జిల్లా శాయంపేట మండలం పత్తిపాక గ్రామానికి చెందిన నాగలత(29)తో నాలుగు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి రెండేళ్ల కుమారుడు ఉండగా.. ప్రస్తుతం నాగలత 8 నెలల గర్భిణి. కాగా నాగలత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నదని ఆమె కుటుంబసభ్యులకు సమాచారమందించారు. అత్తింటి వారే కొట్టి చంపారని మృతురాలి బంధువులు ఆరోపించారు. భర్త, అత్త మామ, మరిది కలిసి నాగలతను కొట్టి చంపి ఉరి వేశారని మృతురాలి తండ్రి నగిరబోయిన రాజయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తాండ్ర వివేక్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి


సందీప్‌రెడ్డి(ఫైల్)

బెజ్జంకి, ఏప్రిల్ 10: రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతిచెందిన సంఘటన మండలంలోని బేగంపేటగూడెం గ్రామ శివారులో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బెజ్జంకి మండలం గూడెం గ్రామానికి చెందిన హనుమండ్ల సందీప్‌రెడ్డి(29) వడ్లూరు గ్రామానికి చెందిన తన స్నేహితుడి రాజుతో కలిసి కారులో మండలంలోని లక్ష్మీపూర్ గ్రామం నుంచి గూడెం గ్రామానికి వెళ్తున్నాడు. బేగంపేట గ్రామ శివారులో వారు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో సందీప్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందగా, రాజుకు గాయాలయ్యాయి. గాయపడిన రాజును కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి రామచంద్రారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో బైక్ వెళ్తున్న యువకుడి మృతి


మృతిచెందిన సంపత్‌కుమార్

జీడిమెట్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం మధ్యాహ్నం జరిగింది. సంగారెడ్డి జిల్లా, కంగ్టి మండలం సిద్ధంగిరి గ్రామానికి చెందిన రత్నప్ప కుమారుడు ఎం.సంపత్‌కుమార్(35) బతుకు దెరువు కోసం నగరానికి వచ్చి సూరారం కాలనీ ప్రాంతంలోని సాయిబాబానగర్ మొండి నర్సింహబస్తీలో నివాసముంటున్నాడు. స్థానికంగా వెల్డర్‌గా పనిచేస్తున్న సంపత్‌కుమార్ బుధవారం మధ్యాహ్నం 1 గంటల సమయంలో జైరాజ్‌ఇస్పాత్ ఎదరుగా ఉన్న రోడ్డు నుంచి ఇంటికి బైక్‌పై వెళ్తున్నాడు. ఎదురుగా అతివేగంగా వచ్చిన లారీ బైక్‌ను ఢీకొట్టడంతో సంపత్‌కుమార్ కిందపడ్డాడు. లారీ ముందు చక్రాలు తలపై పోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

కుక్కల దాడిలో 60 గొర్రె పిల్లలు మృతి


మృతిచెందిన గొర్రెపిల్లలను పరిశీలిస్తున్న గొర్రెల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాపుమల్‌శెట్టి

మనూరు, ఏప్రిల్ 10: కుక్కల దాడిలో 60 గొర్రెపిల్లలు మృతిచెందిన సంఘటన మనూరు మండలం బెల్లాపూర్ గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన దత్తుగొండ, హన్మగొండ, బస్‌గొండ, శ్రీను, సుధాకర్, బసిగొండలకు చెందిన 60 గొర్రెపిల్లలపై కుక్కలు దాడి చేయడంతో మృతిచెందాయి. విషయం తెలుసుకున్న గొర్రెల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాపుమల్‌శెట్టి బాధితులను పరామర్శించి మాట్లాడారు. గొర్రెల పెంపకందారులకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

కాజీపల్లిలో అక్రమ కట్టడాల కూల్చివేత


అక్రమ కట్టడాలు కూల్చివేస్తున్న రెవెన్యూ అధికారులు

జిన్నారం, ఏప్రిల్ 10: జిన్నారం మండలంలోని కాజీపల్లిలో ప్రభుత్వ భూమిలో నిర్మించిన పలు కట్టడాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. బుధవారం కాజీపల్లి 181 సర్వే నెంబరులో అక్రమంగా నిర్మించిన గదులు, ప్రహరీ, బేస్‌మెంట్లను ఆర్‌ఐ జయప్రకాష్ నారాయణ సిబ్బందితో కలిసి ఎక్స్‌కవేటర్లతో కూల్చేయించారు.

మిరుదొడ్డి ఎంపీపీపై నాన్‌బెయిల్ వారెంట్ జారీ

మిరుదొడ్డి, ఏప్రిల్ 10: చెప్యాల గ్రామంలో మహిళను నిర్బంధించి, అసభ్యంగా ప్రవర్తించిన కేసులో మిరుదొడ్డి ఎంపీపీ సాయిలుపై నాన్‌బెయిల్ వారెంట్ జారీ అయ్యిందని ఎస్‌ఐ పరశురాం తెలిపారు. బుధవారం మిరుదొడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఆయన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 2020లో ఎంపీపీ సాయిలు ఓ మహిళను బెదిరించడంతోపాటు నిర్బంధించి అసభ్యకంగా ప్రవర్తించాడు. దీంతో బాధిత మహిళ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశామన్నారు. ఇదే విషయమై కోర్టుకు హాజరుకావాల్సిందిగా ఎంపీపీని కోరగా.. హాజరుకాకపోవడంతో కోర్టు ధిక్కరణ కింద నాన్ బెయిల్ వారెంట్‌ను జారీచేసిందని తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీపీ సాయిలు కోర్టులో హాజరైనట్లు సమాచారం.

హెల్త్ సబ్ సెంటర్‌ను తనిఖీ చేసిన ఎమ్మెల్యే



రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, ఏప్రిల్ 10: మండల పరిధిలోని హన్మంత్‌రావుపేట హెల్త్ సబ్ సెంటర్‌ను బుధవారం ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. సబ్‌సెంటర్ ద్వారా రోగులకు అందుతున్న సేవలు, ఇతర వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సబ్ సెంటర్ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ సెంటర్ వైద్యాధికారి శృతి, మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి, రాజుసేట్, జాదవ్‌సర్దార్, సిబ్బంది పాల్గొన్నారు.

'రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు నడుం బిగించాలి'

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 10: డా.బీఆర్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు యువత నడుం బిగించాలని హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ అధ్యక్షుడు రాహుల్ పిలుపునిచ్చారు. సంగారెడ్డిలోని సంస్థ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాత్మా జ్యోతిబాఫూలే విద్యా వికాసం కోసం, మహిళా జాతి విముక్తికి పోరాడిన మహోన్నతుడు అంబేడ్కర్ అని కొనియాడారు.

కుదిరిన ముహూర్తం

- వారంరోజుల్లో 'హస్తం' గూటికి బీఆర్ఎస్ కౌన్సిలర్లు
- మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యేను కలిసిన వైనం

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 10: జిల్లా కేంద్రమైన మెదక్ మున్సిపల్ పరిధిలో బీఆర్ఎస్ నేతల వలసలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే మున్సిపల్‌కు చెందిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు ముగ్గురితో పాటు కో-ఆప్షన్ సైతం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. తాజాగా బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌ను మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్, కౌన్సిలర్ సమియొద్దీన్, నేతలు గోదల సాయిరాం, బెండల నిఖిల్, శ్రీధర్‌యాదవ్, సాంసన్ సందీప్ కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమతమ వార్డులలో అభివృద్ధి పనుల కోసమై మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యేను కలిశామని చెబుతుండగా.. కాంగ్రెస్ నేతలు మాత్రం మరో వారంరోజుల్లో పైవారందరూ కాంగ్రెస్‌లో చేరబోతున్నట్లు పేర్కొంటున్నారు. ఎన్నికల సమయం నుంచే కౌన్సిలర్లు దొంతి లక్ష్మీముత్యంగౌడ్, మమతాప్రవీణ్‌గౌడ్, దాయర రాజలింగం, ఆవారి శేఖర్ కాంగ్రెస్‌లోనే కొనసాగుతండగా మొన్నటిరోజున ముగ్గురు కౌన్సిలర్లు, ఒక కో-ఆప్షన్ పార్టీలో కలవగా తాజాగా మరో ఏడుగురు ఎమ్మెల్యేను కలవడంతో ముహూర్తం కుదిరిందని చెప్పుకోవచ్చు. వారంరోజుల్లోగా మరికొంత మంది కౌన్సిలర్లను కలుపుకొని పది మందికి పైగా హస్తం గూటికి చేరుకోనున్నట్లు తెలిసింది. దీంతో కాంగ్రెస్‌కు 16కు పైగా కౌన్సిలర్ల బలం చేరుకోనున్నది. తదనంతరం సంఖ్యాబలం అనుగుణంగా అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశాలున్నట్లు కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నారు.



ఎమ్మెల్యే రోహిత్‌ను కలిసిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు

'జీపీ కార్మికులకు పెండింగ్ వేతనాలివ్వండి'

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 10: గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలివ్వాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి రాజయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సంగారెడ్డిలో డీపీవో సాయిబాబకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. జిల్లాలో ఆరునెలలుగా గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేతనాలు రాక కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బకాయి వేతనాలు చెల్లించి, కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరిక

నర్సాపూర్, ఏప్రిల్ 10: సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పాలన పట్ల ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఇతర పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరేందుకు ఉత్సాహం చూపుతున్నారని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్‌లు తెలిపారు. బుధవారం నర్సాపూర్‌లోని రాజిరెడ్డి క్యాంపు కార్యాలయంలో నర్సాపూర్ మాజీ ఎంపీపీ జి.శ్రీనివాస్‌గౌడ్, శివ్వంపేట మాజీ ఎంపీపీ గోవింద్‌నాయక్‌తో పాటు చిన్నచింతకుంటకు చెందిన వందమందికిపైగా బీఆర్ఎస్ కార్యకర్తలు రాజిరెడ్డి, ఆంజనేయులుగౌడ్, రాష్ట్ర నాయకులు సుహాసినిరెడ్డి, శేషసాయిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌గుప్తా, మల్లేశం, ఆంజిగౌడ్, ఉదయ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌గుప్తా, రషీద్, అశోక్, అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఇద్దరు మాజీ ఎంపీపీలు, వారి అనుచరగణం

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

నారాయణఖేడ్, ఏప్రిల్ 10: విద్యుదాఘాతంతో పాడి గేదె మృతిచెందింది. మండల పరిధిలోని వెంకటాపూర్ కిషన్‌నాయక్‌తండాకు చెందిన కేలోత్ మోతిబాయికి తన పాడి గేదెను మేతకు తీసుకెళ్లింది. ఈ క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. గేదె విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని తండావాసులు తెలిపారు. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

- రూ.1.50 లక్షల ఆస్తి నష్టం

చేగుంట, ఏప్రిల్ 10: చేగుంట మండలం వడియారం గ్రామానికి చెందిన నర్సింహులు ఇంట్లో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతం ఏర్పడింది. ఈ ఘటనలో ఇంట్లోని ఎల్‌ఈడీ టీవీ, రూ.10 వేల నగదు, బియ్యం, బట్టలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.1.50 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆర్ఐ సంతోష్ సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

అల్లాదుర్గం, ఏప్రిల్ 10: అక్రమంగా తరలిస్తున్న 12 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకుని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని ఐబీ చౌరస్తా వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నుంచి కామారెడ్డి జిల్లా పిట్లం పట్టణానికి డీసీఎంలో బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుబడ్డాయన్నారు. దీంతో వాహన డ్రైవర్ తీయాజ్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎన్నికల నిర్వహణలో రాజకీయ పార్టీలు సహకరించాలి

- జహీరాబాద్ ఆర్డీవో రాజు

జహీరాబాద్, ఏప్రిల్ 10: ఎన్నికల నిర్వహణ సమయాల్లో రాజకీయ పార్టీలు ప్రజలకు, అధికారులకు సహకరించాలని ఆర్డీవో రాజు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఆయా రాజకీయ పార్టీలకు చెందిన నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఓటరు నమోదు, తొలగింపులు, మార్పులు, చేర్పులు తదితరాల గురించి వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం నాయకుడు అత్తర్ అహ్మద్, బీజేపీ రాష్ట్ర నాయకుడు సుధీర్‌బండారి పాల్గొన్నారు.

ఈతకోసం చెరువుల వద్దకు వెళ్లొద్దు: ఎస్ఐ

ఝరాసంగం, ఏప్రిల్ 10: వేసవికాలం ఉన్నందున పిల్లలు చెరువుల వద్దకు ఈతకు వెళ్లొద్దని ఝరాసంగం ఎస్ఐ రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులకు హాస్టళ్ల, పాఠశాలల నుంచి ఇంటికొచ్చిన పిల్లలు ఎండ వేడిమిని తట్టుకోలేక సరదా కోసం వాగుల్లోకి, చెరువుల్లోకి ఈతకు వెళ్లి ప్రమాదాల బారినపడుతున్నారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టాలన్నారు.



జీర్లపల్లి చెరువువద్ద బ్యానర్‌ను ఏర్పాటు చేసిన పోలీసులు

రోడ్లపై ధాన్యం ఆరబెడితే చర్యలు: ఎస్ఐ

కొల్చారం/నర్సాపూర్, ఏప్రిల్ 10: రోడ్లపై ధాన్యం ఆరబెడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కొల్చారం ఎస్ఐ మహ్మద్‌గౌస్ తెలిపారు. కొల్చారం మండలంలోని మెదక్-సంగారెడ్డి ప్రధాన రహదారిపై ఉన్న చిన్నామన్‌పూర్, సంగాయిపేట, రంగంపేట, ఎనగండ్ల, మెదక్-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఉన్న రాంపూర్, కిష్టాపూర్, పోతంశెట్‌పల్లి, అప్పాజిపల్లి, కొల్చారం గ్రామాల్లో రోడ్లపై ధాన్యం ఆరబోసిన రైతులకు అవగాహన కల్పించారు. రోడ్లపై ధాన్యం ఆరబోయడం వల్ల ఎంతోమంది ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారని, ఇటీవలనే వెల్దుర్తి మండలంలో చనిపోయిన విషయాన్ని రైతులకు తెలిపారు. రైతులు ఖాళీ స్థలాల్లో కానీ, పొలాల్లో కానీ ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలని సూచించారు. రోడ్లపై ధాన్యాన్ని ఆరబెట్టొద్దని నర్సాపూర్ ఎస్ఐ పృథ్వీరాజ్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

న్యాల్‌కల్, ఏప్రిల్ 10: రైతులు పంటల సాగు కంటే ముందుగా పొలాల్లో యాజమాన్య పద్ధతులను పాటించాలని కృషి విజ్ఞాన శాస్త్రవేత్త స్నేహలత, రమేష్, స్వామి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని శంషల్లాపూర్, వడ్డీ, టేకూర్, మల్గి, హుసెల్లి తదితర గ్రామాల్లో రైతులకు యాజమాన్య పద్ధతులు, సేంద్రియ ఎరువుల తయారీ తదితరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పాల్గొని రైతులకు మట్టిపరీక్షల ప్రాముఖ్యత, పంచగవ్య, ఘన, ద్రవ జీవామృతం తయారీ, చీడ, పీడల నివారణ, దశపర్ని కషాయం, బ్రహ్మాస్త్రం, పుల్లటిమజ్జిగ తదితరాల తయారీ, వాడే విధానం గురించి అవగాహన కల్పించారు. రైతులు సాధ్యమైనంతవరకు సేంద్రియ ఎరువులను వాడాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



శంషల్లాపూర్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త స్నేహలత, తదితరులు

బీజేపీతోనే దేశంలో సుస్థిర పాలన

- బీజేపీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్



ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరిన గడ్డపోతారం బీఆర్ఎస్ నాయకులు

జిన్నారం, ఏప్రిల్ 10: బీజేపీతోనే దేశంలో సుస్థిర పాలన, అభివృద్ధి అని బీజేపీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం మండలంలోని గడ్డపోతారంకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు లక్ష్మణ్‌రావు, శివశంకర్, బాలయ్య, మాణిక్యం, ఓంకార్, యాదగిరి, శ్రీశైలం సహా 50 మంది ఈటల సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

కుల వివక్షను అంతం చేద్దాం.. సామాజిక న్యాయాన్ని సాధిద్దాం

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్

పుల్‌కల్, ఏప్రిల్ 10: కుల వివక్షను అంతం చేసి, సామాజిక న్యాయాన్ని సాధించడమే కార్మిక వర్గం కర్తవ్యమని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ అన్నారు. చౌటకూర్ మండలం వెంకటకిష్టాపూర్ గ్రామంలో మహనీయుల జయంత్యోత్సవాలను పురస్కరించుకుని బుధవారం సహపంక్తి భోజనాలు నిర్వహించారు. ఈ నెల 6 నుంచి 14 వరకు మహనీయుల జయంత్యోత్సవాల్లో భాగంగా సామాజిక న్యాయ వారోత్సవాలను నిర్వహించాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందన్నారు. ఇందులో భాగంగానే కులాలు, మతాలకతీతంగా సహపంక్తి భోజన కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించామని పేర్కొన్నారు. కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతిమేల మాణిక్యం మాట్లాడుతూ కార్మికవర్గం హక్కుల కోసం పోరాటం చేస్తూనే సమాజంలో నెలకొన్న కుల వివక్షతను అంతమొందించేందుకు సీఐటీయూ కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మల్లమ్మ, మాజీ సర్పంచ్ బస్వాపురం స్వరూపశ్రీనివాస్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పీ.బాగారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



వెంకటకిష్టాపూర్‌లో సహపంక్తి భోజనాలు చేస్తున్న సీఐటీయూ, కేవీపీఎస్ నాయకులు

రామచంద్రాపురంలో ఎన్ఎస్‌యూఐ సమావేశం

- పాల్గొన్న మంత్రి కొండా సురేఖ



మంత్రి సురేఖకు స్వాగతం పలుకుతున్న నాయకులు

రామచంద్రాపురం, ఏప్రిల్ 10: రామచంద్రాపురంలోని శ్రీ కన్వెన్షన్‌హాల్‌లో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిర్వహించిన మెదక్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, డీసీసీ అధ్యక్షురాలు నిర్మలాజగ్గారెడ్డి, చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, కాట శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలపించాలని ప్రజలను కోరారు.

అల్లాదుర్గం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా రఘుపతి

అల్లాదుర్గం, ఏప్రిల్ 10: అల్లాదుర్గం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా గొండ రఘుపతిని కార్యవర్గం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా వీరేందర్, రమేష్, ప్రధాన కార్యదర్శిగా కృష్ణ, కోశాధికారిగా వెంకట్‌రామ్, కార్యదర్శిగా పాపయ్య, గౌరవాధ్యక్షుడిగా భూమయ్య సలహాదారులుగా శివకుమార్, కార్యవర్గ సభ్యులుగా సాయిలును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నేడు బూత్ కమిటీల సమావేశం

- పాల్గొననున్న ఏడు నియోజకవర్గాల్లోని శ్రేణులు
- హాజరుకానున్న మాజీ మంత్రి ఈటల రాజేందర్, ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు

మెదక్ అర్బన్, ఏప్రిల్ 10: లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీజేపీ వ్యూహ రచనలు రూపొందిస్తోంది. పోలింగ్ నిర్వహణలో ఎంతో కీలకమైన బూత్‌కమిటీలు, శక్తికేంద్రాల బాధ్యులను ఎన్నికలకు సమాయత్తం చేస్తోంది. ఇందుకోసం మెదక్ పార్లమెంట్ స్థాయి సమావేశాన్ని గురువారం సాయంత్రం 5 గంటలకు జిల్లా కేంద్రంలో చిల్డ్రన్స్ పార్కులో నిర్వహిస్తోంది. ఈ సమావేశానికి మూడు జిల్లా పరిధిలోని మెదక్, సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, నర్సాపూర్, సంగారెడ్డి, పటాన్‌చెరువు నియోజకవర్గాల్లోని 2,156 బూత్ స్థాయి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొంటారు. దాదాపు రెండు నుంచి మూడువేల మందిని సమావేశానికి తరలించేందుకు నాయకత్వం ప్రణాళికలు రూపొందించింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి ఈటల రాజేందర్, మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు హాజరుకానున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ తెలిపారు.

తప్పిపోయిన పాపను తల్లిదండ్రులకు అప్పగింత



పాపను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

రామాయంపేట, ఏప్రిల్ 10: రామాయంపేట పట్టణంలో బుధవారం సంత ఉన్నందున ఓ రెండేళ్ల చిన్నారి తప్పిపోయి ఏడుస్తూ ఉన్నది. గమనించిన స్థానికులు చిన్నారిని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. అయితే వాట్సాప్ గ్రూపుల్లో పాప ఫొటోను వైరల్ చేయడంతో తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ఎస్ఐ రంజిత్ అన్ని వివరాలు సేకరించిన తర్వాత స్థానికుల సమక్షంలో పాపను వారికి అప్పగించారు.

రంజాన్‌కు ఏర్పాట్లు పూర్తి



నర్సాపూర్ ఈద్గా వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్ తదితరులు

వెల్దుర్తి/నారాయణఖేడ్/నర్సాపూర్, ఏప్రిల్ 10: రంజాన్‌ను పురస్కరించుకుని వెల్దుర్తిలోని ఈద్గా వద్ద నేడు ఉదయం 9 గంటలకు నిర్వహించే సామూహిక ప్రార్థనలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ముస్లిం కమిటీ మండలాధ్యక్షుడు జమాల్ బుధవారం తెలిపారు. రంజాన్‌ను ముస్లింలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆయన అన్నారు. అలాగే ఖేడ్ పట్టణ శివారులోని ఈద్గాను మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, కౌన్సిలర్ మాజీద్, మైనార్టీ నాయకులు తాహేర్‌అలీ, ముంతాజ్ సందర్శించారు. గురువారం రంజాన్‌ను పురస్కరించుకుని ఈద్గాకు వెళ్లే రోడ్డు, వాటి పరిసరాల్లో పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని శానిటేషన్ అధికారి శ్రీనివాస్‌ను చైర్మన్ ఆదేశించారు. ఈ మేరకు పరిశుభ్రత పనులను సిబ్బందితో చేపట్టారు. రంజాన్ సందర్భంగా నర్సాపూర్‌లోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నందున మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయిమోద్దీన్ స్వయంగా ఈద్గీ వద్దకెళ్లి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వరి కోతపై ప్రయోగం

వెల్దుర్తి, ఏప్రిల్ 10: మండల పరిధిలోని బండపోసన్‌పల్లి గ్రామంలో వరి కోతపై బుధవారం డివిజనల్ ఉప గణాంక అధికారి శ్రీనివాస్‌తో కలిసి మెదక్ జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి మాన్య ప్రయోగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి కోత ప్రయోగంలో భాగంగా పొలంలో ఐదు మీటర్ల వెడల్పు, పొడవు విస్తీర్ణంలో పంటను కోసి నూర్పిడి చేసి ధాన్యం తూకం వేయగా 12.800 కిలోల దిగుబడి వచ్చిందన్నారు. ఈ దిగుబడి ప్రకారం ఎకరం పొలంలో 20 నుంచి 22 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌వో దివ్యభారతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మంగల్‌పేటలో ఉచిత మజ్జిగ పంపిణీ ప్రారంభం

నారాయణఖేడ్/పుల్‌కల్/రామాయంపేట/మనూరు, ఏప్రిల్ 10: నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట దుర్గామాత జాతరను పురస్కరించుకొని బుధవారం కౌన్సిలర్ స్వప్న అభిషేక్‌షెట్కార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో స్వప్నఅభిషేక్ షెట్కార్, జడ్పీటీసీలు రాఘవరెడ్డి, లక్ష్మీబాయిరవీందర్‌నాయక్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాసిత్, పట్టణ అధ్యక్షుడుఏ నగేష్ పాల్గొన్నారు. అనంతరం దుర్గామాత ఆలయంలో భూపాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుల్‌కల్ మండల కేంద్రం చౌటకూర్ గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రం, అంబలి కేంద్రాన్ని తహసీల్దార్, పంచాయతీ ప్రత్యేకాధికారి జి.ఈశ్వరీరాణి ప్రారంభించారు. రామాయంపేటలోని ప్రభుత్వాస్పత్రిలో లయన్స్ స్నేహబంధు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ లింబాద్రితో పాటు క్లబ్ ప్రతినిధులు దామోదర్‌రావు, ఐరేని రవీందర్‌గౌడ్ బుధవారం ప్రారంభించారు. మనూరు మండల పరిధిలోని డోవూరు గ్రామానికి చెందిన వెంకట్ లొంక హనుమాన్ మందిర్, తిమ్మాపూర్ వద్ద శివాజీ సేనల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు.



మంగల్‌పేటలో ఉచిత మజ్జిగ పంపిణీని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

జాతీయ సైన్స్ దినోత్సవంలో 'గీతా' విద్యార్థుల ప్రతిభ

తూప్రాన్, ఏప్రిల్ 10: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 28న జిల్లాస్థాయిలో విద్యార్థులకు వివిధ అంశాలలో నిర్వహించిన పోటీల్లో తూప్రాన్ గీతా స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపి డీఈవో రాధాకిషన్ నుంచి ప్రశంసలు అందుకున్నారు. 10వ తరగతి విద్యార్థి సాయిహర్షిణి సైన్స్ ఫేర్‌లో జిల్లాస్థాయి ప్రథమ బహుమతితో రాష్ట్రస్థాయిలో సైతం పాల్గొన్నారు. కే.మానస చిత్రలేఖనంలో జిల్లాస్థాయిలో ప్రథమస్థానం, శ్రీజ సైన్స్ ఫెయిర్‌లో జిల్లాస్థాయి ద్వితీయ బహుమతిని సాధించారు. అన్వరి జిల్లాస్థాయి బహుమతి సాధించింది. జాతీయ సైన్స్ దినోత్సవంలో ప్రతిభచూపిన విద్యార్థులను కరెస్పాండెంట్ పీ.రామాంజనేయులు, చైర్‌పర్సన్ పీ.ఉష, డైరక్టర్లు రాఘవేందర్‌గౌడ్, నారాయణగుప్తా, ప్రిన్సిపాల్ వెంకటకృష్ణారావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రేంరాజ్, సైన్స్ ఉపాధ్యాయులు అభినందించారు.

దౌల్తాబాద్‌లో పోలీసుల కవాతు

హత్నూర, ఏప్రిల్ 10: పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా హత్నూర మండలం దౌల్తాబాద్‌లో పోలీసులు పారా మిలటరీ బలగాలతో కవాతును బుధవారం రాత్రి నిర్వహించినట్లు జిన్నారం సీఐ సుధీర్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు చేపట్టేందుకు, శాంతిభద్రతల కాపాడేందుకు పోలీసు కవాతు నిర్వహించడం జరిగిందన్నారు. 18 ఏళ్లు నిండి, ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ కవాతులో ఏఆర్ డీఎస్పీ నరేందర్, స్థానిక ఎస్ఐ సుభాష్, ఎస్ఐలు, సీఐలు, సిబ్బంది, సుమారు 150 మంది పారామిలటరీ సిబ్బంది పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.